సాక్షి సూర్యాపేట

బుధవారం ❘ 20 ❘ సెప్టెంబర్ ❘ 2023



వెలుగు చూసిన అక్రమాలు
చివ్వెంల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగు చూశాయి. - 8లో



నృసింహుడి నిత్య కల్యాణం
మట్టపల్లి ఆలయంలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు నిర్వహించారు. - 8లో



అన్నివర్గాలకు అండగా
బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటుందని శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రజా ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలి

నూతనకల్: ప్రజా ఆరోగ్య సంరక్షణకు వైద్య సిబ్బంది పాటుపడాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్ కోరారు. మంగళవారం నూతనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమగ్ర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు అందిస్తోందన్నారు. ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కీంలతో మోసం చేస్తున్న కాంగ్రెస్

పెన్‌పహాడ్: కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కానీ స్కీంలను అమలు చేస్తామని ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేయడం లేదని, తెలంగాణలో అధికారం సాధించడమే ధ్యేయంగా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మండల కేంద్రానికి చెందిన పిడమర్తి రామనర్సయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. అంగన్‌వాడీ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోకల రాములు, కట్కూరి కార్తీక్‌రెడ్డి, తూముల సాయి, రంగినేని విజయ్‌కుమార్, రాపర్తి వెంకన్న, మధు, చెన్ను రమణారెడ్డి, చామకూరి వెంకటేష్, గుడిపూరి శ్రీను, ఒగ్గు వినోద్ పాల్గొన్నారు.

ప్రణాళికతో పనిచేస్తున్నాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఎన్నికల సన్నాహం, లోక్ అదాలత్ మొదలగు అంశాలపై మంగళవారం డీజీపీ హైదరాబాద్ నుంచి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఎస్పీ పాల్గొని మాట్లాడారు. పోలీస్ ఫంక్షనల్ వర్టికల్స్‌లో ప్రతి నెలా ప్రతిభను కొనసాగిస్తూ 9 విభాగాల్లో రాష్ట్రంలో జిల్లా గ్రీన్‌జోన్‌లో కొనసాగుతోందని డీజీపీ అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు ప్రకాష్, శ్రీనివాస్, రాజేష్, సీఐలు,ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కలెక్టరేట్‌లో ఓటరు అవగాహన ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డిలు సంయుక్తంగా జెండాను ఊపి మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు ఓటర్ అవగాహన ర్యాలీ వాహన బ్యానర్‌పై 'నేను తప్పక ఓటు వేస్తాను' అని సంతకాల సేకరణ చేశారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్లతో పాటు జిల్లా అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, సూర్యాపేట ఆర్డీఓ వీరబ్రహ్మచారి, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, చివ్వెంల తహసీల్దార్ రంగారావు , ఇండస్ట్రియల్ అధికారి తిరుపతయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జా ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేటలో భూకబ్జా ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వట్టె జానయ్యయాదవ్‌కు వ్యతిరేకంగా రోడ్డుపైకి వస్తున్న భూ బాధితులకు సాయం చేస్తామని చెప్పి మంత్రి అనుచరులు కొత్తదందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వట్టె జానయ్య, అతని బంధువుల వద్ద భూములు, ఇళ్లు కొనుగోలు చేసిన వారి ఇళ్లు, స్థలాల వద్దకు వెళ్లి మంత్రి అనుచరులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. న్యాయవాది, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మంద్ర మల్లయ్యయాదవ్ ఇంటికి బీఆర్ఎస్ నాయకులు వచ్చి కాంపౌండ్‌ను ధ్వంసం చేశారన్నారు. సమావేశంలో గట్ల రమాశంకర్, కంబాలపల్లి శ్రీనివాస్, చంద్రకాంత్, వీరేష్ నాయక్, బందర్ నాయక్, గోపి, వినయ్‌గౌడ్, ఈశ్వర్ సింగ్ పాల్గొన్నారు.

● కొలువుదీరిన గణనాథులు





గణేశ్ నవరాత్రుల సందర్భంగా సూర్యాపేట పట్టణంలో ఎద్ద గోపయ్య విగ్రహం వద్ద మట్టితో శంకు ఆకారంలో గణనాథుడు, 27వ వార్డులో పాము పడగలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు

వేలిముద్ర వేయాల్సిందే

..లేకుంటే రేషన్‌లో కోత
- రేషన్ కార్డుల్లో యూనిట్ల పరిశీలనకు ప్రభుత్వం ఆదేశం
- ప్రతి యూనిట్ ఈకేవైసీ చేయాలని నిర్ణయం
- ఈకేవైసీ పూర్తి కాని యూనిట్ కార్డు నుంచి తొలగింపు
- జిల్లాలో 9,33,386 మంది కార్డుదారులు


కోదాడలో రేషన్ దుకాణంలో చేస్తున్న ఈకేవైసీని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రేషన్ కార్డుల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డులో పేరున్న ప్రతి లబ్ధిదారుడు తమ పరిధిలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ కేవైసీని పునరుద్ధరించుకోవాలి. లేకుంటే రేషన్ బియ్యం బంద్ అయ్యే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల్లో కొందరు లేకున్నా బియ్యం మాత్రం యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ అవుతున్నాయి. ఇలా చాలా వరకు దుర్వినియోగం కావడంతో ఈకేవైసీ పరిశీలనపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

యూనిట్ల పరిశీలన ఎందుకంటే..
జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వివిధ కేటగిరీల ప్రకారం 3,24,333 రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా 9,33,386 మంది వినియోగదారులకు నెలకు 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక రేషన్ కార్డుల స్థానంలో ఆహార భద్రత కార్డులను తీసుకువచ్చింది. ఆ సమయంలో ఆధార్‌తో ఈ కేవైసీ చేశారు. అయితే చాలా కాలంగా పునరుద్ధరించలేదు. కాగా రేషన్ కార్డులు కలిగిన వినియోగదారుల్లో కుటుంబ యజమానులు మరణించడం, కుటుంబంలో ఆడబిడ్డలకు పెళ్లిళ్లు జరిగి వెళ్లిపోవడం, మగ పిల్లలుంటే పెద్దయ్యాక పెళ్లిళ్లు జరిగి కుటుంబాలు విడిపోవడం వంటివి చోటు చేసుకున్నాయని, ఈ ప్రకారం కుటుంబ సభ్యుల్లో(యూనిట్లు) కొందరు లేకున్నా బియ్యం మాత్రం యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ అవుతోంది. ఇలా చాలా వరకు దుర్వినియోగం కావడంతో ఈకేవైసీ పరిశీలనపై ప్రభుత్వం దృష్టి సారించనట్లు తెలుస్తోంది.

ఈకేవైసీ పరిశీలన ఇలా..
రేషన్ కార్డు కలిగిన కుటుంబ యజమానితో పాటు కార్డులో పేర్లున్న కుటుంబ సభ్యులందరు సమీప చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ పాస్ యంత్రంలో మరోమారు వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయగానే రేషన్ కార్డు నంబరుతో పాటు అతని ఆధార్‌కార్డు నంబరు చూపిస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆకుపచ్చ వెలుగు వచ్చి సదరు వినియోగదారుని కేవైసీ పునరుద్ధరించబడుతుంది. ఒకవేళ కేవైసీ పునరుద్ధరణలో ఈ పాస్ యంత్రంలో రెడ్ లైట్ వెలుగు వస్తే సదరు వినియోగదారుని రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిపోల్చలేమంటూ రిజెక్టు సూచిస్తుంది. ఇలా ఒక యూనిట్ రేషన్ నుంచి తొలగించబడుతుంది. రేషన్ కార్డులో ఎంతమంది పేర్లు ఉంటాయో వారంతా చౌకధర దుకాణం వద్దకు కేవైసీ కోసం ఒకేసారి రావాల్సి ఉంటుంది. ఎవరు హాజరు కాకపోయినా, ఈకేవైసీ కాక పోయినా కార్డు నుంచి తొలిగిస్తారు.

పక్కాగా అమలు చేసేందుకు..

కార్డులో పేర్లు ఉన్న లబ్ధిదారులకే బియ్యం అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే రేషన్ కార్డుల పరిశీలనకు శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం కేవైసీని పునరుద్ధరించుకోవాలని ఆదేశించింది. వినియోగదారులు సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. లేకుంటే చౌక బియ్యం సరఫరా నిలిపేసే ఆస్కారం ఉంటుంది.

– వి. మోహన్‌బాబు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

ఆధార్ అప్‌డేట్ లేకుంటే సమస్యే..

రేషన్ కార్డులు దాదాపు పదేళ్ల క్రితం మంజూరు చేసినవి కావడం, అప్పుడు ఐదేళ్లలోపు ఉన్న పిల్లలు రేషన్ కార్డులో నమోదు అయిన వారికి ప్రస్తుతం ఈ కేవైసీ చేసేందుకు వెలిముద్రలు పడకపోవచ్చు. ఇలాంటి లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేయిస్తే కానీ రేషన్ కార్డు ఈకేవైసీ పూర్తి చేయలేరు. ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా నూతన కార్డులు మంజూరు చేయకపోవడం, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయకుండా రేషన్‌కార్డు లబ్ధిదారుల కేవైసీ పరిశీలించడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. పారదర్శకత పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కరెంటు కోసం రోడ్డెక్కిన రైతులు


చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కోదాడ- జడ్చర్ల హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో

చిలుకూరు: కరెంటు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ రైతులు మంగళవారం చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్స్ కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం 10 గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కరెంట్ సమస్య వల్ల పొలాలు వద్దనే కాపాలా ఉండాల్సి వస్తోందన్నారు. చిలుకూరు సబ్‌స్టేషన్‌కు నేరుగా 33 కేవీ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చి సమస్య పరిష్కారం చేసేవరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్ సంఘటనా స్థలం వద్దకు చేరుకొని ట్రాన్స్‌కో ఏఈ, డీఈతో మాట్లాడారు. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

పెసర క్వింటా రూ.9,309

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 129 బస్తాల పెసళ్లు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఈ సీజన్‌లోనే అత్యధికంగా పెసళ్లకు క్వింటాకు రూ.9,309, కనిష్టంగా రూ.7132 ధర పలికినట్లు వివరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


నేరేడుచర్లలో ఇళ్ల స్థలాల కోసం రాస్తారోకో చేస్తున్న సీపీఐఎంఎల్ ప్రజా పంథా నాయకులు

నేరేడుచర్ల : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. నేరేడుచర్లలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో స్థానికంగా జడ్చర్ల–కోదాడ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం పేదలు పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రేణుక, అఖిల్, నాగన్న, పావని, హుస్సేన్, కరుణాకర్, మరియమ్మ, మౌలాంబీ, ఫాతిమా, సత్య, కొమరయ్య, నర్సమ్మ, వీరబాబు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 89789 63674

కాంగ్రెస్ హామీలన్నీ బోగస్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి

- ప్రజలను మోసగించడం కాంగ్రెస్‌కు అలవాటే
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : తుక్కుగూడ విజయభేరి సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలలను నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్‌కు ఏనాడూ లేదు ఉండబోదన్నారు. ప్రజలను మోసగించడం కాంగ్రెస్‌కు అలవాటేనని పేర్కొన్నారు. అధికారం కోసం ఇక్కడి నేతల స్క్రిప్ట్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు ఇచ్చిన హామీలు బఫూన్, బుడ్డర్ ఖాన్‌లను తలపించేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కాపీ చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. అమలుకు సాధ్యం కానీ అబద్ధపు హామీలు ఇచ్చే అలవాటు సీఎం కేసీఆర్‌కు లేదన్నారు. నూటికి నూరు శాతం చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని పథకాలను సైతం కేసీఆర్ అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్‌ఏలుతున్న ఏ ఒక్క రాష్ట్రంలోనూ తుక్కుగూడ సభలో ప్రకటించిన పథకాలు లేవన్నారు. రాష్ట్రానికో మేనిఫెస్టోతో మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. మోదీ పాలనతో విసుగు చెంది కేసీఆర్ వంటి ప్రత్యామ్నాయం లేక ప్రజలు కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. వారంటీలు లేని గ్యారెంటీలు ఇచ్చి కర్ణాటకను కాంగ్రెస్ ఆగం చేసిందన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ కబంధ హస్తాల నుంచి విముక్తి కావాలి

- మాజీ మంత్రులు రఘువీరారెడ్డి, ఆర్డీఆర్


గ్యారంటీ స్కీంలు వివరిస్తున్న రఘువీరా, ఆర్డీఆర్

పెన్‌పహాడ్: కేసీఆర్ కుటుంబ కబంధహస్తాల నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి పొందడానికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని సీడబ్ల్యూసీ మెంబర్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డుపై సోమవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. విజయభేరి సభ ద్వారా సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలపై ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకొని సామాన్యులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అన్నీ అబద్ధాలు చెబుతారని త్వరలోనే ప్రజలు తిరుగుబాటు చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలు అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని గుర్తు చేశారు. వైఎస్ హయాంలోనే పేదలందరికీ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు, రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించిన చరిత్ర కాంగ్రెస్ దేనని వివరించారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని చెప్పారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీని వచ్చే ఎన్నికల్లో బలపర్చి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, కొప్పుల వేణారెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పిన్నాని కోటేశ్వర్‌రావు, ఎంపీటీసీ కొండేటి పవన్, చకిలం రాజేశ్వర్‌రావు, అడ్డి కేశవులు పాల్గొన్నారు.

రుణమాఫీ దక్కలే..!

రైతులకు శాపంగా అధికారుల తప్పిదాలు
- ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్ పంపిన అధికారులు
- ఈ కారణంతో ఉమ్మడి జిల్లాలో 1536 మంది రైతులకు దక్కని మాఫీ
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



తప్పుడు సమాచారం కారణంగా రుణమాఫీ పొందని రైతుల వివరాలు

జిల్లా	బాధిత రైతులు	మాఫీ కావాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
నల్లగొండ	829	4.93
సూర్యాపేట	317	1.77
యాదాద్రి	390	2.30




ఈ ఫొటోలోని రైతు కందుకూరి జనార్దన్‌రెడ్డి. ఈ రైతు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని పాలకవీడు పీఏసీఎస్‌లో ఎనిమిదేళ్ల క్రితం వ్యవసాయ రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ ప్రకారం ఈ రైతుకు రుణం మాఫీ కావాల్సి ఉంది. కానీ ఈ రైతుకు అదే పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న మరో రైతుకు సంబంధించిన ఆధార్, ఫోన్ నంబర్‌ను అధికారులు జాబితాలో పంపారు. దీంతో ఈ ఇద్దరు రైతులు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి దూరమయ్యారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు మాఫీ అందలేదు.

నల్లగొండ అగ్రికల్చర్ : అధికారుల తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ దక్కలేదు. అధికారులు రుణమాఫీ జాబితా తయారు చేసే సమయంలో ఇద్దరు ముగ్గురు రైతులకు ఒకే ఆధార్, ఫోన్ నంబర్‌ను వేసి పంపడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. ఒకే సర్వే నంబర్‌పై పలువురు రైతులు పేర్ల కూడా పంపారు. ఇలాంటి సమస్య ఉన్న రైతులకు ఇప్పటికి రుణమాఫీ డబ్బులు జమకాలేదు. జూలై 26 నుంచి ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను రైతుల రుణ ఖాతాల్లో జమ చేస్తోంది. అధికారులు చేసిన పొరపాట్ల కారణంగా కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా లబోదిబోమంటూ బ్యాంకులు, వ్యవసాయ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

హడావుడిగా జాబితాల తయారీ..
2018 ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2018 డిసెంబర్ 11 లోపు రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతుల జాబితాను పంపించమని ప్రభుత్వం బ్యాంకర్లను ఆదేశించింది. దీంతో బ్యాంకు అధికారులు హడావుడిగా రుణ గ్రహీతల జాబితాను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ జాబితాలను సరిచూసుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం రూ.25 వేలలోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. తిరిగి జూలై 26వ తేదీ నుంచి రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తోంది. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసినప్పటికీ కొందరు రైతులకు మాఫీ అందలేదు. ఇదేమని రైతులు.. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులను అడిగితే.. ఒకరిపై మరొకరు మాది తప్పు కాదంటే.. మాది తప్పు కాదని బదులిస్తున్నారు. మరికొన్ని చోట్ల బ్యాంకుల్లో సరి చేస్తారని చెబుతుండగా.. కొన్ని చోట్ల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తప్పులను సరిచేసి సరైన జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి రుణమాఫీ అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

బ్యాంకుల్లో సరిచేయించుకోవాలి



ఏమైనా పొరపాట్లు జరిగి రుణమాఫీ కాని రైతులు ఆయా బ్యాంకుల్లో సరిచేయించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. రైతులు వెంటనే సంబంధిత బ్యాంకులకు వెళ్లి జరిగిన పొరపాట్లను సరిచేయించుకుంటే వారికి రుణమాఫీ డబ్బులు రుణఖాతాలో జమ చేస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ నల్లగొండ

క్లుప్తంగా

సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు

- రూ.1.27 లక్షల నిధులు స్వాహా
- టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీస్



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

చివ్వెంల(సూర్యాపేట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చివ్వెంల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగు చూశాయి. 2020 డిసెంబర్ 1 నుంచి 2023 మార్చి 30 వరకు రూ.20కోట్ల 7లక్షల వ్యయంతో నిర్వహించిన పనులకు సామాజిక తనిఖీ చేశారు. ఈ నెల 5 నుంచి 18 వరకు గ్రామాల్లో నిర్వహించిన తనిఖీ ద్వారా వెలుగు చూసిన అక్రమాలకు డీఆర్‌పీలు సమావేశంలో చదవి వినిపించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 31 గ్రామాలకు గాను రాత్రి వరకు 14 గ్రామాలకు సబంధించిన తనిఖీ నిర్వహించారు. మిగిలిన గ్రామాలను బుధవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీటిల్లో కొలతలు, తప్పుడు మస్టర్లు రాయిట, పనులు చేయకుండానే చేసినట్లు వేతనాలు చెల్లించి నిధులు స్వాహా చేసినందుకు గాను, పలువురు పంచాయతీ కార్యదర్శులతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వీరి నుంచి దుర్వినియోగం జరిగిన నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ ఎస్. కిరణ్ కుమార్, అంబుడ్స్‌మెన్ ధరావతు లచ్చిరాంనాయక్, ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్, ఎంపీడీఓ లక్ష్మీ, ఏపీఓ ఇరుగు నాగయ్య, ఎంపీఓ టి.గోపి, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహం విలువ వెలకట్టలేనిది



వేణుశర్మ కుంటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిశోర్ తదితరులు

సంస్థాన్ నారాయణపురం: స్నేహం విలువ వెలకట్టలేనిదని తుంగతుర్తి ఎమ్మెల్యే, సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి గాదరి కిశోర్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి వేణుశర్మ ఇటీవల మృతిచెందాడు. దీంతో సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో ఉంటున్న వేణుశర్మ కుంటుంబ సభ్యులకు సోమవారం రూ.15లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, కోశాధికారి వివేక్, జంపాల రాజు, కష్ణయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి
- మరణంలోనూ తోడుగానే..



విష్ణు, స్వప్న (ఫైల్)

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణ శివారు పానగల్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధి పానగల్‌కు చెందిన ఓర్సు విష్ణు(34) తన భార్య స్వప్న(29)తో కలిసి బైక్‌పై పానగల్ రిజర్వాయర్ ప్రధాన తూము వద్దకు ఉదయం 5:30 గంటలకు వచ్చాడు. అక్కడ బైక్‌ను పార్క్ చేసి దంపతులిద్దరూ చందనపల్లి వైపు వాకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నల్ల గొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం దంపతుల ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన వారు అక్కడికక్కడే మృతిచెందారు. విష్ణు నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో కామర్స్ కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. గాయపడిన వారిని 108వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటి కే మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పక్షం రోజుల తర్వాత వాకింగ్‌కు వెళ్తే..

ఆ దంపతులకు ఇటీవల తీరిక లేకపోవడంతో వాకింగ్‌కు వెళ్లలేదు. 15రోజుల తర్వాత మంగళవారం వాకింగ్‌కు వెళ్లగా ప్రమాదం చోటుచేసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతులకు ఆరేళ్ల కుమారుడు కార్తీక్, రెండేళ్ల కుమార్తె విశిష్ట ఉన్నారు. మృతుడి సోదరుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇటీవల ఇదే రోడ్డులో నకిరేకల్ మండలం తాటికల్ వద్ద జరిగిన ప్రమాదంలో నూతన దంపతులు మృతిచెందారు.

వాహనాన్ని ఢీకొని..



సాయిప్రసాద్ (ఫైల్)

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన కేసాని స్వామి కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలో ఇల్లు కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సాయిప్రసాద్(21) సోమవారం సాయంత్రం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి స్కూటీపై బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తూ రాత్రి 10గంటలకు ఎల్లగిరి శివారులో పేదరాశి పెద్దమ్మ హోటల్ ఎదురుగా ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న సాయిప్రసాద్ తలకు గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందా డు. వెనుక కూర్చున్న అతని స్నేహితులు అఖిలాష్, శబరిలకు గాయాలవ్వగా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

వాహనం టైరు మారుస్తుండగా..

ఆలేరురూరల్ : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన అశ్వినికుమార్ పాండే(30) సోమవారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో అల్లం, వెల్లుల్లి బస్తాలు లోడ్ చేసుకొని వరంగల్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో వాహనం ఆలేరు శివారులోని బహద్దూర్‌పేట హైవే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని రోడ్డు ఒకవైపు నిలిపి టైరును మరుస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అశ్వినికుమార్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సంతోష్‌పాడే ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



బక్కమ్మ(ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లికి చెందిన వీరబోయిన బక్కమ్మ(44) భర్త పదేళ్ల క్రితమే చనిపోవడంతో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సోమవారం సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామానికి వెళ్లిన బక్కమ్మ అదే రోజు రాత్రి ఆటోలో కేతేపల్లికి చేరుకుంది. ఆటో దిగిన వెంటనే ఇంటికి వెళ్లేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారి సమీపంలో హైవే దాటుతోంది. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై దూరంగా ఎగిరిపడిన బక్కమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బక్కమ్మకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మద్యం మత్తులో భార్యను కొట్టి చంపిన భర్త

హుజూర్‌నగర్ : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి భార్యను చిత్రహింసలకు గురిచేసి కొట్టడంతో మృతిచెందింది. హుజూర్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనపై సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ హరికష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణానికి చెందిన భవాని రవి, కమల (30) దంపతులు. వారికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం. గతంలో హుజూర్‌నగర్‌లో నివాసం ఉన్న వారు ప్రస్తుతం కోదాడలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతులిద్దరూ చిత్తు కాగితాలు, పాత ఇనుప సామగ్రి ఏరుకొని జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా భర్త రవిత్రాగుడు బానిసై భార్య కమలను కొట్టి వేధిస్తుండేవాడు. దీంతో కమల అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయేది.

వెతికి పట్టుకొచ్చి చావబాది..

రవి మూడు వారాల క్రితం కమలను కొట్టగా ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లి పోయింది. ఈ నెల 17వ తేదీ ఆదివారం కమల కోదాడలో ఉన్న విషయం రవి తెలుసుకున్నాడు. పూటుగా మద్యం తాగి అక్కడికి బైక్‌పై వెళ్లి ఆమెను బైక్‌పై ఎక్కించుకొని హుజూర్‌నగర్ పట్టణంలోని పాత వివేకవర్ధిని కాలేజీ వద్దకు వచ్చాడు. అక్కడ ఆమెను బాగా కొట్టగా ఆ దెబ్బలు తాళలేక అక్కడికక్కడే చనిపోయింది. అనంతరం రవి ఆమెను అక్కడే వదిలేసి పారి పోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. తల్లి మృతిచెందడం, తండ్రి పరారీలో ఉండడంతో ఐదుగురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి సోదరి తురాయి ఆమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పాతగుట్ట ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారి శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఆలయ ముఖ మండపంలో 108 బంగారు, వెండి, రాగి కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వయంభూలకు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు శతఘటాభిషేకం నిర్వహించారు. భక్తులు అధికంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు భక్తులు యాదాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం



స్వాతి(ఫైల్)

చిట్యాల: ఉరేసుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామానికి చెందిన రెగుల గడ్డ కుమారస్వామికి మనుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన స్వాతి(28)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వీరు చిట్యాలలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కుమారస్వామి చిట్యాలలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్ట్‌నర్‌గా ఉన్నాడు. స్వాతి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. సంఘటన స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ మహేష్, చిట్యాల ఎస్ఐ రవి పరిశీలించారు. స్వాతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థి..

మాడ్గులపల్లి: మండలంలోని చిరుమర్తి గ్రామ ఆవాసం జలుబావిగూడేనికి చెందిన ఖాదర్‌పాషా కుమారుడు అమ్రీన్ (17) నల్లగొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండీయర్ చదువుతున్నాడు. సోమవారం ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. సమీప రైతులు గమనించేలోపే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఖాదర్ పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇ.నరేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

సూర్యాపేట క్రైం : పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన రౌతు శ్యాంప్రసాద్ (38) స్థానిక అంబేద్కర్ నగర్‌లోని శ్రీ గణేష్ ట్రేడర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్య సునీతకు వీడియో కాల్ చేసి దుకాణంలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే భార్య పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

- అతనికి సహకరించిన వ్యక్తి కూడా అరెస్ట్

భువనగిరి: అంతర్రాష్ట్ర దొంగతో పాటు అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన బీసుపోగు శ్యాంసన్ ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని నల్లకుంటలో బైక్ దొంగిలించి దానిపై బీబీనగర్ మండలంలోని నెమురగోముల, రాఘవపురం గ్రామాలల్లో తాళం వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. అదేరోజు రాత్రి పోచంపల్లి మండలంలోని ముక్తాపూర్‌లో తాళం వేసిన మరో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి సొమ్మును అపహరించుకెళ్లాడు. దొంగిలించిన సొమ్మును తనకు తెలిసిన శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద ఉంచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం పోచంపల్లి మండంలోని జూలూరు గ్రామంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న శ్యాంసన్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. గతంలో శ్యాంసన్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో 15 కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. శ్యాంసన్‌తో పాటు శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేసి వారి నుంచి 8తులాల బంగారం ఆభరణాలు, 20 తులాల వెండి, రెండు బైకులు, నాలుగు సెలఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, పోచంపల్లి ఎస్ఐ విక్రంరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెన్‌పహాడ్ : అక్రమంగా నిల్వ ఉంచిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన పాలిశెట్టి సత్యనారాయణ రేషన్ కార్డు దారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వచేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా 43బస్తాల్లో 20క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. బియ్యాన్ని సీజ్ చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం

భువనగిరి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన బోగి గణేష్, వరంగంటి నవీన్, దేవర రమేష్, బోగి నరేష్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే డబ్బుతో అవసరాలు తీరక పోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 2వ తేదీన నలుగురు లాంగ్ డ్రైవ్ యాప్‌లో నంబర్‌లేని కారును బుక్ చేసుకున్నారు. ఆ కారులో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో ముందుగా వెళ్తున్న కారు నంబర్‌ను నోట్ చేసుకున్నారు. అనంతరం ఆ నంబర్ గల ప్లేట్‌ను తయారు చేయించుకుని తమ అద్దెకారుకు ఏర్పాటు చేసుకున్నారు. అదే రోజు వరంగల్‌కు వెళ్లి అక్కడే రాత్రి కారులోనే నిద్రించారు.

మహిళను బెదిరించి..

ముఠా సభ్యులు ఈ నెల 3న ఉదయం 5గంటలకు వరంగల్ నుంచి జాఫర్‌ఘడ్, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సమయంలో బోగి నరేష్ కారు నడుపుతున్నాడు. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు మీదుగా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గమనించారు. సమీపంలోకి వెళ్లి ఆమెను పట్టుకుని, కేకలు వేయకుండా నోరు మూశారు. అరిస్తే చంపుతామని బెదిరించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని, వాటికి ఉన్న రెండు పుస్తెలను ఆమెకే ఇచ్చి అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరోసారి చైన్ స్నాచింగ్‌కు వెళ్తూ..

ముఠా సభ్యులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో చైన్ స్నాచింగ్ పాల్పడేందుకు మేడిపల్లిలోని లాంగ్‌డ్రైవ్ సెంటర్‌కి వెళ్లి కారు అద్దెకు తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి భువనగిరి మీదుగా చిట్యాలకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు వలిగొండ మండలం నాగారం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న వాహనాన్ని నిలిపారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 33గ్రాముల పుస్తెలతాడు, 5మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, వలిగొండ ఎస్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి వేధింపులకు వివాహిత బలి

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట) : స్నేహితుడి వేధింపులకు వివాహత బలైంది. సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్ (ఎస్) మండలం ఇస్తాళ్లాపురం గ్రామానికి చెందిన మున్న మనీష(23)కు మహబూబాబాద్ జిల్లా దాట్ల గ్రామానికి చెందిన శ్యాంతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇస్తాళ్ళాపురం గ్రామానికి చెందిన దాసరి వెంకటేష్, మనీష చిన్నతనంలో ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆ పరిచయంతో అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. దీని ఆసరాగా తీసుకున్న వెంకటేష్ ఫోన్ రికార్డులు తన దగ్గర ఉన్నాయని కొంత కాలంగా మనీషను వేధిస్తున్నాడు. ఇటీవల కొన్ని ఫొటోలు, ఆడియో రికార్డులను భర్తకు పంపడంతో మనీష మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో మనీష తల్లిగారింటికి వచ్చి సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పాపమ్మ ఫిర్యాదు మేరకు శ్యామ్‌తో పాటు అతని స్నేహితులు నర్సన్, సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలోని మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నా.. నీవెంటే నేనూ..

- ఒక్కరోజు వ్యవధిలో అనారోగ్యంతో సోదరులు మృతి
- బీబీగనర్ మండల గూడూరులో విషాదం



శివారెడ్డి(ఫైల్)



యాదిరెడ్డి(ఫైల్)

బీబీనగర్ : అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఇద్దరు సోదరులు రోజు వ్యవధిలో మృతిచెందడంతో బీబీనగర్ మండలం గూడూరులో విషాదం అలుముకుంది. గూడూరు గ్రామానికి చెందిన కొంతం శివారెడ్డి(80) కొంతం యాదిరెడ్డి(60) తమ కుటుంబాలతో కలిసి పక్క పక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల అన్నదమ్ములు ఇద్దరు అనారోగ్యం బారిన పడి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి శివారెడ్డి అస్వస్థతకు గురై మృతిచెందాడు. సోమవారం ఉదయం శివారెడ్డి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే సోదరుడు యాదిరెడ్డి సైతం అస్వస్థతకు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి నిర్వహించారు. రోజు వ్యవధిలో సోదరులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోదనలు మిన్నంటాయి.

అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



అడవిదేవులపల్లి: చెక్కులు పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ అండగా ఉంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన ఆర్చ్, ప్రహరీ నిర్మాణానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్‌తో కలిసి గుత్తా సుఖేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాడా–ట్రైకార్ పథకం కింద మండలంలోని 74 మంది గిరిజనులకు మంజూరైన రూ.91.25లక్షల విలువైన చెక్కులతో పాటు 70మంది రైతులకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భాస్కర్‌రావు పట్టుబట్టి మరీ రూ.300కోట్లతో కృష్ణపట్టి రైతులు చిరకాల కోరిక అయినటువంటి దున్నపోతుల గండి–చిట్యాల ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారని అన్నారు. పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సేవ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల చినరామయ్య, స్థానిక సర్పంచ్ కొత్త మర్రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను నాయక్, ఎంపీటీసీలు కుర్ర కాంతి కృష్ణకాంత్ నాయక్, పేర్ల లింగయ్య, మండల రైతు బంధు అధ్యక్షుడు సూర్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు బాబుజానీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు అశోక్ నాయక్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణపై ప్రధాని విషం చిమ్మారు

నల్లగొండ : ప్రధాని మోదీ తెలంగాణపై విషయం చిమ్ముతున్నాడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ తలుపులు పెట్టి.. తెలంగాణ ఇచ్చారని గతంలో అన్నాడని, తెలంగాణలో ఆనాడు రక్తపుటేర్లు పారాయని అనడం అర్థ రహితం అని అన్నారు. ప్రధాని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో పారిన రక్తపుటేరు సంఘటనలు ఇంకా మరిచిపోనట్లు ఉందని సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనాడు వాజ్‌పేయ్ నాయకత్వంలో బీజేపీ మూడు రాష్ట్రాలు ఇచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని కూడా ఇస్తే ఎవరూ చనిపోయేవారు కాదన్నారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటం ఫలితంగానే కేంద్రం దిగి వచ్చి తెలంగాణ ఇచ్చిందని, ప్రజల ఒత్తిడి మేరకు తెలంగాణ ఏర్పాటు అయిందని అన్నారు. మోదీ మాట్లాడే దాంట్లో అర్థం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తుందని సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. 6 గ్యారంటీ హామీలు ఉత్తివేనని, వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ వల్లే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. కాంగ్రెస్‌కు విజన్ లేదన్నారు. గ్యారంటీ హామీల్లో రూ.2 లక్షల రుణమాఫీని ఎందుకు మర్చిపోయారని ప్రశ్నించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం బీజేపీ పని అని, బీజేపీ పతనం ప్రారంభం అయింది.. అందుకే మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు అంటూ హడావుడి చేస్తున్నారని అన్నారు. మహిళా బిల్లుతోపాటు ఓబీసీ బిల్లు కూడా ఆమోదించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పాల్గొన్నారు.